నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

1,26,423 మంది విద్యార్థులకు 150 పరీక్ష కేంద్రాలు

సాక్షి,సిటీబ్యూరో: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు మేడ్చల్, మల్కాజిగిరిజిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఎం.కిషన్ తెలిపారు. ఈనెల 5 నుంచి 25 వరకు జరిగే ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 150 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని వసతులను కల్పించామన్నారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్ 64,107 విద్యార్థులు పరీక్షలు రాస్తుండగా, సెకండ్ ఇయర్ 62,316 విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షల పర్యవేక్షణకు ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌తో సహా ఐదు సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించినట్లు తెలిపారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల్లో మెడికల్ టీమ్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

అంగన్‌వాడీ సభ్యుల ముందస్తు అరెస్ట్



పోలీసుల అదుపులో జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర

ఘట్‌కేసర్: అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి యూనియన్లు ఇచ్చిన పిలుపు మేరకు నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అంగన్‌వాడీ టీచర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు సుచిత్రను ఎన్‌ఎఫ్‌సీనగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం ఉదయం అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

ఎంఎంటీఎస్ మూడోదశ లైన్‌కు భూసర్వే



సర్వే చేస్తున్న అధికారులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు నిర్మించనున్న మూడోదశ ఎంఎంటీఎస్ లైన్ కోసం కీసర ఆర్డీఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం భూసర్వే చేపట్టారు. ఈ సందర్భంగా అంకుషాపూర్, అవుషాపూర్, ఘట్‌కేసర్‌లో నూతన ట్రాక్ కోసం సర్వేచేసి హద్దురాళ్లను ఏర్పాటు చేశారు. సర్వే డీఐ సత్తమ్మ, సర్వేయర్లు వినయ్, సునీత, భవానీ, ఆర్‌ఐలు కావ్యారెడ్డి, సాయిరాం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్‌సీఈలో విద్యార్థులకు శిక్షణ

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసీటీ అకాడమీ ఆధ్వర్యంలో పాథన్ వెబ్ డెవలపర్‌పై 15రోజుల పాటు నిర్వహించనున్న ట్రైనింగ్ ప్రోగ్రామ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ ప్రారంభించారు. 65మంది విద్యార్థులు 15 రోజుల పాటు పరిశ్రమ అవసరాలు, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ పొందనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రకటించారు. ఐసీటీ అకాడమీ మెంటర్లు బుర్రా దినేష్, గోపాల్, ఓంకార్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఆవిష్కరణలో స్థానిక నాయకులు

శామీర్‌పేట్: ముడుచింతలపల్లి మండలం పోతారం గ్రామంలో (భారతీయ కిసాన్ సంఘ్) బీకేఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కాగా, గ్రామ అధ్యక్షుడు వంగ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలపై స్థానిక నాయకులు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన వారు వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు సమస్యను ఫోన్ ద్వారా వివరించారు. రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బీఎస్‌కే రాష్ట్ర నాయకులు సురేందర్‌రెడ్డి, మల్లారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు హరిమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు మాచెందర్‌రెడ్డి, రవి, శ్రీకాంత్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రక్షణ కరువు !

● తరచుగా ప్రయాణికులపై దాడులు ● సెల్‌ఫోన్లు, డబ్బులు లాక్కుంటున్న దుండగులు ● భయాందోళనలో ప్రయాణికులు



ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్

ఘట్‌కేసర్ : రైల్వేస్టేషన్ నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ఇక్కడి నుంచి ప్రయాణించేవారికి రక్షణ కరువైందని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వేభద్రత సిబ్బంది విధులు ముగించుకుని ఇంటికెళ్లిన అనంతరం దుండగులు తమ చేతివాటం చూపిస్తున్నారు. దీంతో రాత్రుళ్లు వచ్చే ప్రయాణికులకు భద్రత కరువైంది.

దూర ప్రాంతాల ఎక్స్‌ప్రెస్ రైళ్లు..

ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో సికింద్రాబాద్-వరంగల్ కాకతీయ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-ఖాజీపేట్ పుష్‌పుల్, సికింద్రాబాద్-రేపల్లె, సికింద్రాబాద్-భద్రాచాలం రోడ్డు కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లు నిలుస్తాయి.

రక్తం వచ్చేలా దాడులు..

సికింద్రాబాద్‌లో రైలు పేరు తెలుసుకోకుండా కొందరు మద్యం మత్తులో మరికొందరు ఫ్లాట్‌ఫామ్‌పై ఉన్న రైలెక్కి ఘట్‌కేసర్‌లో దిగుతుంటారు. అర్ధరాత్రి రైల్వే భద్రత సిబ్బంది లేకపోవడంతో కొందరు దుండగులు రక్తం వచ్చేటట్లు ప్రయాణికులపై దాడులకు పాల్పడుతున్నారు. వారి దగ్గరున్న డబ్బులు లాక్కొని పోలీసులకు సమాచారం ఇవ్వకుండా సెల్‌ఫోన్లు కూడా తీసుకుంటున్నారు.

కిటికీ దగ్గరుండే వారే టార్గెట్..

రైలులో నిలబడి, కిటికీ దగ్గరుండి చాలామంది ఫోన్ చూస్తుంటారు. ఈ క్రమంలో స్టేషన్‌లో ఆగి తిరిగి రైలు ఫ్లాట్‌ఫామ్ వీడే సమయంలో చివర ఉండి ఫోన్లు లాక్కున్న ఘటనలు కోకొల్లలు. రైల్వేస్టేషన్ గంజాయికి అడ్డాగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



దుండగుల దాడిలో గాయపడిన వ్యక్తులు (ఫైల్)

దాడి చేసి దుస్తులు లాక్కెళ్లి..

ప్రస్తుతం ప్రయాణికులు, మహిళలు, వృద్ధుల కోసం విశ్రాంతి గదులు కూడా అందుబాటులో లేవు. నెల రోజుల క్రితం మల్కాజిగిరి సఫీల్‌గూడకు చెందిన ఇద్దరు వ్యక్తులు గుర్తు తెలియని రైలెక్కి అర్ధరాత్రి ఘట్‌కేసర్‌లో దిగాల్సి వచ్చింది. ఆ సమయంలో అక్కడికి కొందరు వచ్చి దాడిచేసి డబ్బు, ఫోన్లు లాక్కున్నారు. స్టేషన్ దాటి బయటకు రాకుండా ఓ వ్యక్తి ప్యాంటు కూడా లాక్కున్నారు. బాధితుడు ఉదయం వరకు ఉండి స్థానికుల సాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనంతరం 108 సిబ్బంది వచ్చి స్థానిక ఆసుపత్రిలో వైద్యం చేయించారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..

రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రయాణికుల భద్రతకు కరువైంది. ప్రయాణికుల పేరుతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రక్షణ కల్పించాలని కోరుతున్న రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో గట్టి భద్రత ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రక్షణ కల్పించాలి...



రైల్వేస్టేషన్‌లో సీసీకెమెరాలు లేకపోవడంతో ప్రయాణికులపై దాడులు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అప్పుడే ప్రయాణికులకు భద్రత ఉంటుంది.

– వేముల సాగర్, ప్రయాణికుడు

ప్రత్యేక సిబ్బందిని నియమించాలి...



ప్రయాణికుల్లో అభద్రత భావం పెరిగిపోతోంది. వారు ప్రశాంతంగా రైల్వేస్టేషన్‌లోకి రావాలంటే భద్రత సిబ్బందిని ఏర్పాటు చేయాలి. రాత్రుళ్లు విధులు నిర్వహించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలి.

– రాంరెడ్డి, స్థానికుడు

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా...



అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైల్వేస్టేషన్ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. భద్రత సిబ్బంది లేకపోవడంతో గంజాయి సేవించి ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిపై రైల్వే అధికారులు స్పందించాలి.

– ఖలీల్, స్థానికుడు

రైతులకు నేల ఆరోగ్య నివేదికల పంపిణీ



నేల ఆరోగ్య నివేదిక పత్రాలతో రైతులు, అధికారులు

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి గ్రామంలో ఇక్రిసాట్ – లారస్ ల్యాబ్ ప్రాజెక్టు కింద సాయిల్ హెల్త్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం నిర్వహించారు. సైంటిస్ట్ డాక్టర్ పుష్పజీత్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు వారి నేల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పనిచేయనున్నట్లు తెలిపారు. ఉత్పాదకత, స్థిరత్వాన్ని పెంపొందించడానికి శాస్త్రీయ నేల నిర్వహణ పద్ధతులను అవలంబించడానికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. అనంతరం ఉద్దమర్రి గ్రామానికి చెందిన 216 మంది రైతులు, కేశవపూర్ గ్రామానికి చెందిన 120 మంది రైతులకు నేల ఆరోగ్య నివేదికలను అందజేశారు. రైతులు వారి నేల పరిస్థితులను అర్థం చేసుకోవడంలో పంట ఎంపిక, వ్యవసాయ పద్ధతులపై సమాచారంతో నిర్ణయాలు తీసుకోవడంలో నివేదికలు సహాయపడతాయని తెలిపారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కీసర: మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నాగారం మున్సిపల్ పరిధిలోని స్టార్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాను మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ప్రారంభించారు. జాబ్‌మేళాలో మొత్తం సుమారు 500 మంది వరకు మహిళలు హాజరు కాగా, కొంగరకలాన్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర ఆధ్వర్యంలో మహిళలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు చంద్రారెడ్డి పేర్కొన్నారు. మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బీజేపీ నేతలు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్కూళ్ల వార్షిక ప్రణాళిక ఖరారు

● రూ.30.11 కోట్లతో విద్యా బడ్జెట్‌కు ఆమోదం
● ప్రభుత్వ విద్య బలోపేతం, వసతుల కల్పనకు చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో విద్యావ్యవస్థ బలోపేతం చేసేందుకు అధికారయంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే మన ఊరు– మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో అభివృద్ధి పనులు స్కూళ్లలో నిర్వహిస్తున్నారు. మరోవైపు వచ్చే విద్యా సంవత్సరంలో మౌలికవసతుల కల్పన, నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ బడ్జెట్ రూపొందించింది. 2025–26 విద్యాసంవత్సరానికి రూ.30.11 కోట్లు జిల్లాకు అవసరమని ప్రతిపాదనలు పంపగా దీన్ని ఉన్నతాధికారులు ఆమోదించారు. ఈ నిధులు విడుదలైతే జిల్లాలో విద్యా సమస్యలు తీరుతాయని విద్యాధికారులు భావిస్తున్నారు.

◆ ఈ బడ్జెట్లో అధికంగా పాఠశాలల్లో వసతుల కల్పనతోపాటు విద్యను పూర్తిస్థాయిలో అందించేందుకు అవసరమైన నిధులు కావాలని విద్యాశాఖ నివేదించింది. జిల్లాలో మొత్తం 15 మండలాలు, 13 పురపాలిక సంఘాల పరిధిలో పీఎస్‌లు 375, యూపీఎస్‌లు 22, ఉన్నత పాఠశాలలు 108 ఉండగా, ఇందులో 1.07 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

◆ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 176 ప్రభుత్వ పాఠశాలలో రూ.70 కోట్లతో అదనపు గదుల నిర్మాణంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ కమిటీల ద్వారా 286 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.12.01 కోట్లతో 689 మరమ్మతులు చేపట్టారు.

తాగునీరు..డిజిటల్ తరగతి గదులు..

పాఠశాలల్లో ముఖ్యంగా తాగునీరు, డిజిటల్ తరగతులు, గ్రంథాలయాల నిర్వహణ వంటి విషయాలను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు రూపొందించిన ప్రస్తుత వార్షిక ప్రణాళిక ప్రకారం జిల్లాకు నిధులు విడుదలైతే ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

యూడైస్ ఆధారంగా నిధులు..

ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నిధులు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. గతంలో ఇచ్చిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయటం లేదన్న సాకుతో మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాకు మొత్తం రూ.30.11 కోట్ల నిధులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిధుల్లో అధిక శాతం విద్య, మౌలికవసతుల కల్పనకు కేటాయించారు.

◆ హెచ్‌ఎంలు ఆయా పాఠశాలలకు సంబంధించిన వివరాలు యూడైస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్)లో నమోదు చేసిన ఆధారంగానే ఈ నిధులు విడుదల కానున్నాయి. డిజిటల్ విద్య, ఉపాధ్యాయులకు శిక్షణ, గ్రంథాలయాల ఏర్పాటుకు కూడా నిధులను వినియోగించనున్నారు.

జాతరకు ముస్తాబైన ఆలయం

నేటి నుంచి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



స్వామివారి దర్శనం



రామలింగేశ్వరస్వామి ఆలయం

మేడ్చల్: మేడ్చల్‌లో ప్రఖ్యాతిగాంచిన దాక్షాయని సమేతరామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు (జాతర) నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రకటించారు. మంగళవారం గణపతిపూజ, హోమం ఉదయం అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ట, రాత్రి నందీశ్వరసేవా కార్యక్రమాలు నిర్వహించారు. 5న భృంగీశ్వరసేవ, 6న హంసవాహన సేవ, 7న అశ్వవాహనసేవ, 8న స్వామివారి కల్యాణం, 9న అగ్నిగుండాలు, గజవాహనసేవ, 10న రథోత్సవం, దోపుసేవ (జాతర) కార్యక్రమాలు, 14న వరపూజ, హోలి ఊరేగింపు సేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతర సందర్భంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలు, తోరణాలతో అందంగా అలంకరించారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యాదగిరియాదవ్

ఘట్‌కేసర్: వేసవిని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీలో తాగునీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్ చంద్రశేఖర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. 9వ వార్డు మేడపాటినగర్‌లో నూతనంగా పైపులైన్ నిర్మించాలని, పదోవార్డులో నూతన పైపులైన్ నిర్మించాలని లేఖలో కోరారు. మేధాకాలనీలో నీటి సరఫరా సక్రమంగా కావడంలేదని, కాలనీ పార్కు స్థలంలో బోరువేసి నీటిట్యాంకు ఏర్పాటు చేయాలన్నారు. ఈడబ్ల్యూఎస్ కాలనీ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధానకార్యదర్శి శశిధరన్, సుబ్బారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రజలకు అనధికార లేఔట్‌లో ఉన్న ప్లాట్లు లేఔట్ క్రమబద్ధీకరణకు రాష్ట్రప్రభుత్వం మరోసారి కల్పించిన ఎల్ ఆర్ ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అధికారులు 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను మార్చి 31 వరకు క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఫీజు చెల్లించేందుకు మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది, ఎల్‌టీపీ ప్లానర్స్ తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో 14,300 ఎకరాలకే రైతు భరోసా

● సాగు చేయని 64,700 ఎకరాలకు కట్
● మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా వ్యవసాయశాఖ వెల్లడి

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 14,300 ఎకరాల్లోనే రైతులు వివిధ పంటలు సాగుచేస్తున్నారని గుర్తించిన యంత్రాంగం వీటికే రైతుభరోసా అందజేయాలని నిర్ణయించింది. జిల్లాలో 40,960 మంది రైతులకు (పట్టాదారు పాసు పుస్తకాలు) 79 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వర్షాకాలం, యాసంగిల్లో 60 నుంచి 70 శాతం భూముల్లో పంటసాగు కావటం లేదని తెలుస్తోంది.

గత ప్రభుత్వంలో 79 వేల ఎకరాలకు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద జిల్లాలో 79 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి పంట పెట్టుబడి సాయంలో భాగంగా రైతు బంధు పథకం కింద 35,596 మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.33.10 కోట్ల చొప్పున ఏడాదిలో రూ.66.20 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. ఈ లెక్కన పంటసాగుచేయని వెంచర్లు, కంచెలు, గుట్టలు, రాళ్ల భూములకు కూడా ఈ పథకం వర్తింపజేసినట్లు తెలుస్తోంది.

సాగుచేయని భూములకు నిలిపివేత..

కాంగ్రెస్ ప్రభుత్వం పంటసాగు చేయని భూములకు రైతుభరోసా పథకాన్ని నిలిపేస్తామని ప్రకటించటంతో పాటు పంటసాగు భూములను గుర్తించి నివేదించాలని కోరింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో రెవెన్యూ,వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పంటసాగు భూములపై సర్వే నిర్వహించింది. ఈ సంయుక్త సర్వే ప్రకారం జిల్లాలో యాసంగిలో 14,300 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలు సాగు చేసినట్లు వెల్లడైంది. ఈ యాసంగి సీజన్‌లో రైతుభరోసా పథకంలో భాగంగా 14,300 ఎకరాలకు సంబంధించిన రైతులకు మాత్రమే పంట పెట్టుబడి సాయాన్ని అందజేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యవసాయ శాఖ చర్యలు తీసుకుంటుంది.

అధైర్యపడొద్దు.. డయల్ 100



మై ఛాయిస్ ఫౌండేషన్ సభ్యులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ ప్రభుత్వ పాఠశాలలో మై ఛాయిస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలపై లైంగికదాడులు, అక్రమరవాణాపై మంగళవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా మహిళభద్రతా విభాగం ఎస్పీ అశోక్ హాజరై మాట్లాడుతూ.. మహిళలు, బాలికలు అధైర్యపడొద్దని అత్యవసర సమయంలో 100 నెంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల్యవివాహాలు జరగకుండా ఎల్లప్పుడు నిఘా ఉంటుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాజీ సర్పంచ్ కావేరి, మై ఛాయిస్ ఫౌండేషన్ ప్రతినిధులు, ఎల్క గ్రోప్లర్, డానియల్, దుల, హెచ్‌ఎం శైలజ, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీ

రూ.2 లక్షల నగదు, 3 తులాల బంగారం అపహరణ

పోచారం: తాళం వేసిన ఓ ఇంట్లోకి దుండగులు ప్రవేశించి నగదుతో పాటు నగలు దోచుకెళ్లారు. పోచారం ఐటీ కారిడార్ పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. యంనంపేట్‌లోని తిరుమల ఎన్‌క్లేవ్‌కు చెందిన గుజారీ అంబరీష్ కామారెడ్డిలో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. సెలవు రోజుల్లో మాత్రమే ఇంటికి వస్తుంటాడు. కాగా, తిరుమల ఎన్‌క్లేవ్‌లోని ఇంట్లో భార్య, కుమారుడు, కుమార్తె ఉంటున్నారు. సోమవారం వీరి బంధువు చనిపోవడంతో అంబరీష్ తన భార్యతో పాటు కామారెడ్డికి వెళ్లగా, కుమారుడు, కుమార్తె కాలేజీకి వెళ్లారు. తిరిగొచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని భావించిన బాధితులు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు క్లూస్ టీమ్‌తో కలిసి ఆధారాలు సేకరించారు. రూ.2 లక్షల నగదు, 3 తులాల బంగారం చోరీ జరిగినట్లు బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

అడుగంటుతున్న భూగర్భ జలాలు

పదేళ్ల తర్వాత మేడ్చల్‌లో జోరందుకున్న ట్యాంకర్ల వ్యాపారం



మేడ్చల్ లో వాటర్ ట్యాంకర్లు

మేడ్చల్: ఎండలు మండుతుండటంతో వేసవి ప్రారంభంలోనే మేడ్చల్ పట్టణంలో ఒక్కసారిగా భూగర్భజలాలు అడుగంటిపోతుండటంతో క్రమేపి నీటిసమస్య పెరుగుతోంది. ప్రధానంగా బహుళ అంతస్తుల భవనాలకు నీటి సరఫరా చేయడంలో బోర్లు కీలకంగా ఉండటంతో బోర్లు ఎండిపోతుండటంతో నీటికోసం ట్యాంకర్లపైనే ఆధారపడాల్సి వస్తుంది. చెరువులకు దూరంగా ఉన్న కాలనీల్లో వేసవి మొదటివారంలోనే సమస్య ప్రారంభంకావడంతో భవిష్యత్తులో సమస్య పట్టణమంతా వ్యాపించే ప్రమాదం ఉంది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నీటిసరఫరా భాగానే ఉన్న బహుళ అంతస్తులకు సరిపడేలా నీటి సరఫరా ఉండటం లేదు.

జాతీయ రహదారికి అటువైపు..

44వ జాతీయ రహదారికి ఓ వైపు పాత మేడ్చల్, కొన్ని కాలనీలు, కాలనీపైన రెండు చెరువులు ఉన్నాయి. మరోవైపు కేఎల్‌ఆర్‌నగర్ మూడు ఫేజ్‌లు, శ్రీకాలనీ, అర్చనకాలనీ, బాలాజీనగర్, ఉమానగర్, వెంకట్రామయ్యకాలనీ, ఎంఆర్‌ఆర్ కాలనీ ,రాఘవేంద్రనగర్ కాలనీ తదితర కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోనే మేడ్చల్ కు జీవనోపాధికోసం వచ్చిన వారు అధికంగా నివాసముంటున్నారు. కాలనీలలోనే పట్టణం సగం జనాభా నివాసం ఉంటోంది. ఈ కాలనీలు చెరువులకు దూరంగా ఉండటంతో ఈ ప్రాంతాల్లో వేసవి దృష్ట్యా త్వరగా భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. మేడ్చల్‌లో 1000 ఫీట్ల లోతు బోరు బావిలు ఉన్నా వాటిలో చుక్కనీరు ఉండకపోవడం గమనార్హం.

పదేళ్ల తర్వాత ట్యాంకర్లు..

మేడ్చల్‌కు మిషన్ భగీరథ పథకం రాకముందు వేసవి వచ్చిందంటే ట్యాంకర్లు కనిపించేవి. వేసవి ప్రారంభంలోనే నీటి ఎద్దడి ఏర్పడి అందరూ ట్యాంకర్ల ద్వారానే నీటిని తెప్పించుకునేవారు. పదేళ్ల క్రితం నాటి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మేడ్చల్‌కు ప్రత్యేకంగా రూ.42కోట్లు వెచ్చించి నీటిని రప్పించారు. అదే సమయంలో ఇంటింటికి నీటిసరఫరా కావడంతో పూర్తిగా సమస్య సమసిపోయింది. వందల సంఖ్యలో ట్యాంకర్లు తిరిగే నాటి నుంచి నేటి వరకు పూర్తిగా ట్యాంకర్లు కనబడకుండా పోయాయి. తాజాగా తిరిగి ట్యాంకర్లు కనిపిస్తున్నాయి.

ఒక్కో ట్యాంకర్‌కు రూ.600

మేడ్చల్ శివార్లలో బోరు బావుల వద్ద నీరు పుష్కలంగా ఉండటంతో ట్యాంకర్ వ్యాపారులు అక్కడి నుంచి నీరు తీసుకొస్తూ రూ.600కు ఒక్కో ట్యాంకర్ నీటిని విక్రయిస్తున్నారు. ట్యాంకర్ రూ.600 డ్రైవర్‌కు రూ.50 రోజుకు పెద్ద భవనాల వారు నీటికోసం రూ.650 ఖర్చు చేయాల్సి వస్తుంది.

నెలరోజుల్లో మారిన వ్యవస్థ..

గత నెలరోజుల నుంచి భూగర్భ జాలాలు అడుగంటిపోవడంతో నిరుపయోగంగా ఉన్న ట్యాంకర్లకు వ్యాపారులు మరమ్మతులు చేయించి వినియోగిస్తున్నారు. రోజు కాలనీల్లో 20 నుంచి 30 ట్యాంకర్లు తిరుగుతున్నాయని, ఒక్కో ట్యాంకర్ డ్రైవర్ రోజుకు 5 నుంచి 7 ట్యాంకర్ల నీటిని ఇళ్లలో పోస్తున్నాడు. వేసవి ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే ఎండాకాలం మొత్తం మేడ్చల్ ప్రజలు నీటి కటకట చూడాల్సిందేమోననే అనుమానం వ్యక్తమవుతోంది.